క్లుప్తంగా

పోలింగ్ కేంద్రాల పరిశీలన



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మాసాన్‌పల్లి, జప్తిజా న్కంపల్లి గ్రామాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను శుక్రవారం స్థానికఎంపీడీవో రఘు పరిశీలించారు. ఈ సందర్భంగా పోలింగ్‌కేంద్రాలలో గల వసతులపై ఆయన ఆరా తీశారు. పోలింగ్‌కేంద్రాలలో ఎలాంటి వసతులు లేకున్నా వెంటనే ఏర్పాటు చేయాలని ఆయన కార్యదర్శులకు సూచించారు. పంచాయతీ కార్యదర్శులు సుభాష్‌రెడ్డి, ప్రదీప్ ఉన్నారు.

విద్యార్థులు పరిశుభ్రతను తప్పనిసరిగా పాటించాలి



భిక్కనూరు: ప్రతి విద్యార్థి తప్పని సరిగా వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని భిక్కనూరు పీహెచ్‌సీ వైద్యుడు ఆదర్శ్ అన్నారు. శుక్రవారం ఆయన భిక్కనూరు ప్రభుత్వ బీసీ బాలుర వసతి గృహంలో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులను అందజేశారు. ప్రతి విద్యార్థి తప్పనిసరిగా పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా చుట్టుపక్కల వారిని చైతన్యవంతుల్ని చేయాలన్నారు. ప్రతి నెల విద్యార్థులకు వైద్యపరీక్షలను నిర్వహిస్తున్నామని తల్లిదండ్రులు కూడా తమ సలహాలు సూచనలను పాటించాలన్నారు. హాస్టల్ వార్డెన్ సునీత, సూపర్‌వైజర్ దీవెన, వైద్య సిబ్బంది సతీష్, శ్యామల, సవిత పాల్గొన్నారు.

బాలరాజుకు పరామర్శ



కామారెడ్డి అర్బన్: బాన్సువాడ నుంచి కాంగ్రెస్ పార్టీ కాసుల బాలరాజుకు టికెట్ ఇవ్వకపోవడం మున్నూరుకాపులు, బీసీలకు అన్యాయం చేయడమేనని మున్నూరుకాపు సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మామిండ్ల అంజయ్య, పెట్టుగాడి అంజయ్యలు ఆరోపించారు. శుక్రవారం ఆత్మహత్యాయత్నం చేసి నిజామాబాద్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కాసుల బాలరాజును మున్నూరుకాపు సంఘం జిల్లా నాయకులు పరామర్శించారు. 20 ఏళ్లుగా కాంగ్రెస్ కోసం సేవ చేస్తున్న బాలరాజుకు టికెట్ ఇవ్వకపోవడం వల్లనే మనస్తాపం చెంది ఆత్మహత్యాయత్నం చేశారని, కాంగ్రెస్ పార్టీ బాలరాజుకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

ఫిజియోథెరపి క్యాంప్

పిట్లం(జుక్కల్): మండల కేంద్రంలోని భవిత సెంటర్‌లో శుక్రవారం దివ్యాంగ విద్యార్థుల కోసం ఎంఈవో దేవిసింగ్ ఆధ్వర్యంలో ఫిజియోథెరపి క్యాంప్ ఏర్పాటు చేశారు. ఈ క్యాంప్‌లో ఫిజియోథెరపిస్ట్ విశాలాక్షి 8 మంది దివ్యాంగ విద్యార్థులకు ఫిజియోథెరపి పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఇంటి వద్ద చేయించే వ్యాయామాలపై తల్లిదండ్రులకు పలు సూచనలు చేశారు. ఉపాధ్యాయులు కమల్ కిషోర్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

ధన్వంతరి జయంతి



కామారెడ్డి అర్బన్: ఆయురారోగ్యాలను ప్రసాదించే దేవుడు శ్రీధన్వంతరి జయంతి సందర్భంగా శుక్రవారం స్థానిక ఆయుష్ ఆస్పత్రిలో ఆయన చిత్రపటానికి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ధన్వంతరి జయంతి నిర్వహించి తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ విజయలక్ష్మి, ఆయుర్వేద డాక్టర్ కీర్తన, హోమియో డాక్టర్ విజయలక్ష్మి, డాక్టర్ మానస, ప్రకృతి వైద్యుడు గుండేల దేవయ్య, ఫార్మాసిస్ట్ టి.శ్రీనివాస్, సిబ్బంది జ్యోత్స్న, ప్రసాద్, చంద్రకళ, మాధవి తదితరులు పాల్గొన్నారు.

దత్తో పంత్ టెంగడీజీ జన్మదిన వేడుకలు



కామారెడ్డి టౌన్: స్వదేశీ జాగరణ మంచ్ కామారెడ్డి జిల్లా శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కేంద్రంలోని సరస్వతి విద్యామందిర్ పాఠశాలలో దత్తో పంత్ టెంగడీజీ జన్మదిన వేడుకలను నిర్వహించారు. జిల్లా సంపర్క్ ప్రముఖ్ డాక్టర్ వంగ రాహుల్ హాజరై మాట్లాడారు. స్వదేశీ జాగరణమంచ్, భారతీయ మజ్దూర్ సంఘ్, భారతీయ కిసాన్ సంఘ్‌ను స్థాపించిన వ్యక్తి దత్తోపంత్ టెంగ్డేజీ అని వివరించారు. పాఠశాల హెచ్‌ఎం నాగభూషణం, సంతోష్‌గౌడ్, విద్యార్థులు పాల్గొన్నారు.

అర్హులకు ప్రభుత్వ పథకాలు అందలేదు

- ఎల్లారెడ్డిలో కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయం
- ఎల్లారెడ్డి అసెంబ్లీ కాంగ్రెస్ అభ్యర్థి మదన్‌మోహన్ రావు



రామారెడ్డి మండలంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న మదన్‌మోహన్

రామారెడ్డి(ఎల్లారెడ్డి): అర్హులకు బీఆర్‌ఎస్ సర్కార్ ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలు అందలేదని, బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలే పథకాలను పంచుకున్నారని ఎల్లారెడ్డి కాంగ్రెస్ అభ్యర్థి మదన్‌మోహన్ రావు ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే 6 గ్యారంటీ పథకాలను అమలు చేసి తీరుతామని స్పష్టం చేశారు. శుక్రవారం రామారెడ్డి మండలంలో మోషంపూర్, గొల్లపల్లి, రంగంపేట్, ఉప్పల్వాయి, గోకుల్ తండా, గిద్ద గ్రామాల్లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మదన్ మోహన్ మాట్లాడుతూ.. ఎమ్మెల్యే జాజాల సురేందర్ ఎల్లారెడ్డి నియోజకవర్గానికి చేసిన అభివృద్ధి శూన్యమన్నారు. కాంగ్రెస్ పార్టీ నుంచి ఎమ్మెల్యేగా గెలిపిస్తే సొంత ప్రయోజనాల కోసం బీఆర్‌ఎస్ పార్టీకి అమ్ముడుపోయాడని ప్రజలకు గుర్తు చేశారు. రైతు రుణమాఫీ చేయలేని బీఆర్‌ఎస్ సర్కార్‌ను ఇంటికి పంపే రోజులు దగ్గర పడ్డాయన్నారు. ఎల్లారెడ్డి నియోజకవర్గ అభివృద్ధి కోసం గెలిచిన మరు క్షణం నుంచి పని చేస్తామన్నారు. మదన్ మోహన్ ఎమ్మెల్యేగా గెలవగానే ఒక్క రూపాయి జీతం తీసుకుని మిగిలిన జీతం ప్రజా సేవకు ఖర్చు చేస్తానని చెప్పారు. రూ.2 లక్షల రైతు రుణమాఫీ కాంగ్రెస్ అధికారంలో రాగానే అమలవుతుందన్నారు.బీఆర్‌ఎస్, బీజేపీలు కలిసి పని చేస్తున్నాయని ఆరోపించారు.

కాంగ్రెస్‌లో చేరిన మార్కెట్ కమిటీ డైరెక్టర్

లింగంపేట(ఎల్లారెడ్డి): లింగంపేట మండల కేంద్రానికి చెందిన ఎల్లారెడ్డి మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఫతియొద్దీన్ శుక్రవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మదన్‌మోహన్‌రావు సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. అలాగే ఆయన సతీమణి లింగంపేట-2 ఎంపీటీసీ శమీమున్నిసాబేగం సైతం కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీలో తమకు సరైన గుర్తింపు ఇవ్వకపోవడంతో పార్టీని వీడినట్లు వారు తెలిపారు.

సేవ చేసేందుకు మరో అవకాశం కల్పించండి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సురేందర్

- ఎల్లారెడ్డి అసెంబ్లీ బీఆర్‌ఎస్ అభ్యర్థి జాజాల సురేందర్



తల్లి పాదాలకు నమస్కరిస్తున్న సురేందర్

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి నియోజకవర్గ ప్రజలకు సేవ చేసుకునేందుకు ఓటర్లు మరో అవకాశం కల్పించాలని ఎల్లారెడ్డి అసెంబ్లీ బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే జాజాల సురేందర్ అన్నారు. శుక్రవారం ఎల్లారెడ్డి పట్టణంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నామినేషన్ వేసేందుకు బయలుదేరారు. నామినేషన్ వేసేందుకు వెళ్తున్న సురేందర్‌ను కార్యకర్తలు భుజాలపై ఎత్తుకుని ఊరేగించారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే జనార్దన్‌గౌడ్, మాజీ మంత్రి నేరేళ్ల ఆంజనేయులు, మాజీ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు ఆదిమూలం సతీష్‌తో కలిసి నామినేషన్ దాఖలు చేశారు. కార్యక్రమంలో నాయకులు తానాజీరావు, కపిల్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ తదితరులున్నారు.

కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలి

సదాశివనగర్(ఎల్లారెడ్డి): త్వరలో జరగబోయే ఎన్నికల కోసం పార్టీ కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని ఎమ్మెల్యే జాజాల సురేందర్ సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఆర్యవైశ్య ఫంక్షన్ హాల్‌లో గ్రామస్థాయి బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. దేవుళ్ల మీద ఒట్టు వేయించుకుని ఓట్లు దండుకునే నాయకులను నమ్మొద్దని సూచించారు. 20 రోజుల పాటు కష్టపడాలని, గెలిచిన తర్వాత ఐదేళ్ల పాటు మీకు వెన్నంటి ఉండి ప్రజాసేవకే అంకితమవుతానని పేర్కొన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ నర్సింలు, సర్పంచ్ బద్దం శ్రీనివాస్ రెడ్డి, ఉప సర్పంచ్ రవి, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు మహేందర్ రెడ్డి పాల్గొన్నారు.

మల్కాపూర్ గ్రామస్తుల చేరిక

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): మల్కాపూర్ గ్రామస్తులు శుక్రవారం ఎమ్మెల్యే జాజాల సురేందర్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ, డీసీసీబీ డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, అరవింద్ తదితరులున్నారు.

తల్లి ఆశీర్వాదం తీసుకున్న ఎమ్మెల్యే

లింగంపేట(ఎల్లారెడ్డి): ఎమ్మెల్యే జాజాల సురేందర్ శుక్రవారం నామినేషన్ వేసే ముందు స్వగ్రామానికి వెళ్లి తల్లి హనుమవ్వ పాదాలకు నమస్కరించి ఆశీర్వాదం తీసుకున్నారు. అనంతరం గ్రామంలోని హనుమాన్ మందిరంలో కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు.

కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించం

కామారెడ్డి క్రైం: సీఎం కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్ అన్నారు. శుక్రవారం కామారెడ్డిలో ప్రభుత్వవిప్ గంపగోవర్ధన్ నివాసంలో ఆయన మాట్లాడారు. 75 ఏళ్లు పాలించిన కాంగ్రెస్, బీసీలకు చేసింది ఏమీ లేదన్నారు. కామారెడ్డి వచ్చి బీసీల గురించి రేవంత్‌రెడ్డి మాట్లాడడం దయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందన్నారు. సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పున్న రాజేశ్వర్, నాయకులు నల్లవెల్లి అశోక్, మామిండ్ల అంజయ్య, జూకంటి ప్రభాకర్‌రెడ్డి, తదితరులున్నారు.

మీ సేవకే నా జీవితం అంకితం

- జుక్కల్ అసెంబ్లీ బీఆర్‌ఎస్ అభ్యర్థి హన్మంత్ సింధే



మద్నూర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సింధే

మద్నూర్(జుక్కల్): జుక్కల్ నియోజకవర్గ ప్రజల సేవకే నా జీవితం అంకితమని బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే హన్మంత్ సింధే అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం ఆయన నామినేషన్ వేసిన అనంతరం ర్యాలీ నిర్వహించి మాట్లాడారు. తెలంగాణ ఏర్పడిన అనంతరం ఒక్కో మెట్టు ఎక్కుతూ రాష్ట్రాన్ని అభివృద్ధి చేసుకుంటూ నియోకవర్గంలోని అన్ని మండలాల్లో అభివృద్ధి పనులు చేశామన్నారు.

వాళ్ల మాటలు నమ్మొద్దు: బీబీ పాటిల్

ఎన్నికల సందర్భంగా ఇతర పార్టీల నాయకులు మాయ చేసి ఓట్ల కోసం అబద్ధపు మాటలు చెబుతారని అలాంటి వారి మాటలు నమ్మి మోసపోవద్దని జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్ కోరారు. పక్కన ఉన్న కర్ణాటక, మహారాష్ట్రలో ఎలాంటి సంక్షేమ పథకాలు లేవని కేవలం బీఆర్‌ఎస్ ప్రభుత్వం తెలంగాణలో అమలు చేసిందన్నారు. ఈ సారి ఎన్నికల్లో ఆశీర్వదించి కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. ఎమ్మెల్సీ రాజేశ్వర్, జెడ్పీ మాజీ చైర్మన్ రాజు, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు సురేష్, తదితరులు పాల్గొన్నారు.

సలాబత్‌పూర్‌లో పూజలు

మద్నూర్(జుక్కల్): సలాబత్‌పూర్‌లోని హనుమాన్ ఆలయంలో శుక్రవారం జుక్కల్ బీఆర్‌ఎస్ అభ్యర్థి హన్మంత్ సింధే ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు ఆయనకు తీర్థ ప్రసాదాలు అందించి ఆశీర్వదించారు. అనంతరం అక్కడి నుంచి మద్నూర్‌లోని రిటర్నింగ్ కార్యాలయానికి వెళ్లి నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. ఎంపీపీ లక్ష్మీబాయి, జెడ్పీటీసీ అనిత, కార్యకర్తలున్నారు.

వంద శాతం ఇంటి పన్నులను వసూలు చేయాలి



భిక్కనూరు: మండలంలోని అన్ని గ్రామాల్లో గ్రామ పంచాయతీకి రావాల్సిన ఇంటి పన్నులను వసూలు చేయాలని మండల పంచాయతీ అధికారి ప్రవీణ్ కుమార్ అన్నారు. శుక్రవారం పెద్దమల్లారెడ్డి, కంచర్ల, బస్వాపూర్, మల్లుపల్లి సిద్ధరామేశ్వరనగర్ గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీపీ కార్యదర్శులు తమ సిబ్బందితో కల్సి ఇంటి పన్నులను వసూళు చేయాలన్నారు. అలాగే కార్యదర్శులు తప్పనిసరిగా సమయ పాలన పాటించాలని, పాటించని వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బాన్సువాడలో బీజేపీ భారీ ర్యాలీ



బాన్సువాడ: పట్టణంలో బీజేపీ అభ్యర్థి యెండల లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో శుక్రవారం భారీ ర్యాలీ నిర్వహించారు. బీజేపీ కార్యాలయం నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు కార్యకర్తలతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ర్యాలీకి జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి, కేంద్ర మంత్రి అర్జున్ ముండా హాజరయ్యారు. స్థానిక అంబేడ్కర్ చౌరస్తాలో కేంద్ర మంత్రి మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ పథకాలకు పేరు మార్చి కేసీఆర్ స్వలాభం చూసుకుంటున్నారని, తెలంగాణలో కేసీఆర్ పాలనకు గుణపాఠం చెప్పాలని అన్నారు. నాయకులు దొరబాబు, సుగుణ, కార్గే శ్రీనివాస్, గుడుగుట్ల శ్రీనివాస్, అర్షపల్లి సాయిరెడ్డి, రవీందర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, చిదరి సాయిలు, భూపాల్‌రెడ్డి, తదితరులున్నారు.

అవినీతి పాలనను అంతం చేద్దాం



మద్నూర్(జుక్కల్): బీఆర్‌ఎస్ అవినీతి పాలనను అంతం చేసే సమయం వచ్చిందని, ఈ అవకాశాన్ని ఉపయోగించుకొని ఓటు రూపంలో సమాధానం ఇవ్వాలని జుక్కల్ అసెంబ్లీ కాంగ్రెస్ అభ్యర్థి లక్ష్మీకాంతరావు అన్నారు. మండల కేంద్రంలో నామినేషన్ వేసిన అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే హన్మంత్‌సింధే చేసిన అభివృద్ధి ఎక్కడా కనిపించడం లేదని విమర్శించారు. మూడు పర్యాయాలుగా పని చేస్తున్న స్థానిక ఎమ్మెల్యే పేద ప్రజలను పట్టించుకోకుండా తన పబ్బం గడుపుకున్నాడని మండిపడ్డారు. ఈ ప్రాంతంలోని ఇసుకను అక్రమార్కులకు అప్పజెప్పి రూ. కోట్లు సంపాదించుకున్నారని ఆరోపించారు. ఈ సారి తనకు అవకాశం ఇస్తే ఈ ప్రాంతాన్ని ఎడ్యుకేషన్ హబ్‌గా మారుస్తానన్నారు. చేతి గుర్తుకు ఓటు వేసి గెలుపించాలని కోరారు.

సమస్యల్ని పరిష్కరించేది బీఆర్‌ఎస్ ప్రభుత్వమే



కామారెడ్డి టౌన్: ఉపాధ్యాయులు, ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేది బీఆర్‌ఎస్ ప్రభుత్వమేనని మాజీ ఎమ్మెల్సీ మోహన్ రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కామారెడ్డిలో సీఎం కేసీఆర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. విశ్రాంత ఉద్యోగులు ఇంటింటా ప్రచారం చేసి బీఆర్‌ఎస్ గెలుపు కృషి చేయాలని కోరారు. విశ్రాంత ఉద్యోగులు విఠల్‌రావు తదితరులున్నారు.

కొత్త రేషన్ కార్డుల మంజూరు ఎప్పుడు?

- సర్వసభ్య సమావేశంలో ప్రశ్నించిన ప్రజాప్రతినిధులు



మాట్లాడుతున్న ఎంపీపీ లింగాల స్వరూప

రాజంపేట: రాజంపేట మండల కేంద్రంలోని భవనంలో ఎంపీపీ లింగాల స్వరూప అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా కొనసాగింది. మండలంలో నూతన రేషన్ కార్డుల మంజూరు, సవరణలకు సంబంధించిన సమస్య ఉందని ఆర్గొండ ఎంపీటీసీ సాగర్ సభ దృష్టికి తీసుకెళ్లారు. అదేవిధంగా తమ గ్రామంలో ఉపాధి హామీ పనులు కొంతకాలంగా చేపట్టడం లేదని సంబంధిత ఫీల్డ్ అసిస్టెంట్‌పై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఆరేపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో టీచర్ల కొరత ఉందని స్థానిక సర్పంచ్ కొమ్ము యాదగిరి సభ దృష్టికి తీసుకెళ్లగా ఉపాధ్యాయుల ఏర్పాటు విషయంపై దృష్టి సారిస్తామని ఎంఈవో రామస్వామి తెలిపారు. రాజంపేట మండల కేంద్రంతో పాటు పలు గ్రామాలలో రోజురోజుకి కుక్కల బెడద పెరుగుతోందని ఈ విషయంపై అధికారులు చర్యలు చేపట్టాలని కో-ఆప్షన్ సభ్యులు హైమద్ అలీ కోరారు. సంబంధిత అధికారులు అభివృద్ధి అంశాలను చదివి వినిపించారు. కార్యక్రమంలో ఎంపీడీవో బాలకిషన్, తహసీల్దార్ అనిల్ కుమార్ పాల్గొన్నారు.

విచ్చలవిడిగా పురుగు మందులు వాడొద్దు

- వ్యవసాయ శాస్త్రవేత్త సునీత



వరి పంటను పరిశీలిస్తున్న అధికారులు

భిక్కనూరు: రైతులు తమ పంటలకు విచ్చలవడిగా పురుగు మందులు, ఎరువులను వినియోగించవద్దని వ్యవసాయ శాస్త్రవేత్త సునీత సూచించారు. శుక్రవారం బస్వాపూర్‌లోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన రైతుల అవగాహన సదస్సులో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అతిగా వాడటం వల్ల పంటలకు మేలు చేసే వానపాములు వంటివి మృతి చెందుతాయన్నారు. ప్రతి రైతు వ్యవసాయశాఖ అధికారుల సలహాలు సూచనలు పాటిస్తే అధిక దిగుబడులను సాధించవచ్చన్నారు. ప్రతి రైతు తప్పనిసరిగా పంటమార్పిడి చేపట్టాలన్నారు. మట్టి నమూనాలను వ్యవసాయ అధికారులకు అందించి వారి సూచనల మేరకు పంటలను సాగు చేయాలన్నారు. అనంతరం ఆమె ఆధ్వర్యంలో వ్యవసాయ శాస్త్రవేత్తల బృందం గ్రామంలోని వరి పంటను పరిశీలించారు. రాష్ట్ర సస్య రక్షణ సంస్థ అధికారులు సీల రాణి, రవిశంకర్, జిల్లా వ్యవసాయాధికారి భాగ్యలక్ష్మి, ఏడీఏ అపర్ణ, ఏవో రాధ, ఏఈవో అనంద్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరికలు



కామారెడ్డి టౌన్/కామారెడ్డి రూరల్: జిల్లా కేంద్రంలోని ఇందిరాగాంధీ స్టేడియంలో జరిగిన కాంగ్రెస్ బీసీ డిక్లరేషన్ సభలో ఉమ్మడి జిల్లాకు చెందిన ఆయా పార్టీల నాయకులు పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. డీసీసీబీ మాజీ అధ్యక్షుడు సాయిరెడ్డి, మాజీ కార్పొరేటర్ ప్రవీణ్ గౌడ్, హన్మాల గంగయ్య, బోజన్న, అనంత్ రెడ్డి, సిరిసిల్లాకు చెందిన గాంధీ, కామారెడ్డి సింగిల్ విండ్ మాజీ చైర్మన్ అన్మాల గంగయ్య, సీనియర్ నేత అన్మాల రామ్‌కుమార్, కామారెడ్డి రూరల్ నాయకులు కాంగ్రెస్ చేరారు.

బీడీ కార్మికులు మోసపోవద్దు

కామారెడ్డి టౌన్: సీఎం కేసీఆర్ మాటలకు బీడీ కార్మికులు మోసపోవద్దని కామారెడ్డి అసెంబ్లీ బీఎల్‌ఎఫ్ అభ్యర్థి సిద్ధిరాములు కోరారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. 2014, 2018 అసెంబ్లీ ఎన్నికల్లో బీడీ కార్మికులందరికి జీవన భృతి ఇస్తామని, కటాఫ్ తేది ఎత్తివేస్తామని ఇదే సీఎం కేసీఆర్ హామీలు ఇచ్చి మోసం చేశారని గుర్తు చేశారు.

కేసీఆర్ ఓటమి ఖాయం

కామారెడ్డి టౌన్: బీసీలను మోసం చేస్తున్న సీఎం కేసీఆర్ కామారెడ్డిలో ఓటమి ఖాయమని బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు నీల నాగరాజు జోస్యం చెప్పారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో ఆయన మాట్లాడుతూ.. ముదిరాజ్‌లకు అసెంబ్లీ స్థానాల్లో టిక్కెట్‌లు ఇవ్వకుండా మోసం చేశారని అన్నారు.కేసీఆర్ ముదిరాజ్‌ల అభ్యున్నతికి ఒక్క హామీ కూడా ఇవ్వలేదని, ఆయన్ని బీసీలంతా కలిసి కట్టుగా ఓడించాలని కోరారు.

ఓటు వజ్రాయుధం లాంటిది



తాడ్వాయి జూనియర్ కళాశాలలో మాక్ పోలింగ్ నిర్వహిస్తున్న విద్యార్థులు



గోపాల్‌పేట్ మోడల్ స్కూల్లో ఎథికల్ ఓటింగ్‌లో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు



దోమకొండలో ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తున్న అధ్యాపకులు

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): ఓటు వజ్రాయుధం లాంటిదని మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ సాయిబాబా అన్నారు. శుక్రవారం మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓటు హక్కు ద్వారా మంచి నాయకుడిని ఎన్నుకునే అవకాశం ఉంటుందన్నారు. అనంతరం విద్యార్థులు ఓటు అనే అక్షరంలో కూర్చుని ఓటు ప్రాధాన్యతను తెలిపారు. ఉపాధ్యాయులు శశిశంకర్, నాగరాజు, శ్రీనివాస్, స్రవంతి, తదితరులున్నారు.

దోమకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో..

దోమకొండ: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం విద్యార్థులకు ఓటుహక్కుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఓటు హక్కు ప్రాధాన్యతను తెలియజేసి, మాక్ పోలింగ్ నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ జైపాల్‌రెడ్డి, లెక్చరర్లు వసంత్‌కుమార్, సంతోష్‌రెడ్డి, రోహిణిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

తాడ్వాయి జూనియర్ కళాశాలలో..

తాడ్వాయి(ఎల్లారెడ్డి): తాడ్వాయి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం మాక్‌పోలింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులే స్వయంగా ఎన్నికల అధికారులుగా విధులు నిర్వహించారు. ప్రిన్సిపల్ సయ్యద్ యూసఫ్ హుస్సేన్, తదితరులు పాల్గొన్నారు.

గోపాల్‌పేట్ మోడల్ స్కూల్లో ఎథికల్ ఓటింగ్

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): గోపాల్‌పేట మోడల్‌స్కూల్‌లో శుక్రవారం ఎథికల్ ఓటింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్వీప్ యాక్టివిటీలో భాగంగా జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పాఠశాలలో ఎథికల్ ఓటింగ్ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ శ్రీలత తెలిపారు. ఎన్నికలు జరిగే విధానంపై విద్యార్థులకు ఉపాధ్యాయులు అవగాహన కల్పించారు.

ముగిసిన నామినేషన్ల పర్వం



వెంకటరమణారెడ్డి తరఫున నామినేషన్ దాఖలు చేస్తున్న బీజేపీ మహిళా నాయకులు



బీఎస్పీ అభ్యర్థిగా నామినేషన్ వేస్తున్న జమునా రాథోడ్

మద్నూర్(జుక్కల్): నామినేషన్ల ఘట్టం శుక్రవారంతో ముగిసింది. చివరి రోజున జుక్కల్ అసెంబ్లీ స్థానానికి ఎనిమిది మంది అభ్యర్థులు 23 సెట్ల నామినేషన్లు దాఖలు చేసినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి మనుచౌదరి తెలిపారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి హన్మంత్‌సింధే, కాంగ్రెస్ అభ్యర్థి తోట లక్ష్మీకాంతరావుతో పలు పాటు పలు పార్టీల అభ్యర్థులు, స్వతంత్ర అభ్యర్థులు నామినేషన్ పత్రాలను అందజేశారు.

స్వతంత్ర అభ్యర్థి కాసుల బాల్‌రాజ్ నామినేషన్

బాన్సువాడ : బాన్సువాడ నుంచి స్వతంత్ర అభ్యర్థిగా కాసుల బాల్‌రాజ్ తరఫున ఆయన కుమారుడు కాసుల రోహిత్ శుక్రవారం నామినేషన్ దాఖలు చేశారు.

ఎల్లారెడ్డిలో 10 మంది 13 సెట్ల నామినేషన్ల దాఖలు

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): ఎల్లారెడ్డిలో చివరి రోజున పది మంది అభ్యర్థులు 13 సెట్ల నామినేషన్లు దాఖలు చేసినట్లు రిటర్నింగ్ అధికారి మన్నె ప్రభాకర్ శుక్రవారం తెలిపారు. బీఆర్‌ఎస్ నుంచి జాజాల సురేందర్, కాంగ్రెస్ నుంచి మదన్ మోహన్, బీఎస్పీ నుంచి జమునా రాథోడ్‌తో పాటు స్వతంత్ర అభ్యర్థులుగా పలువురు నామినేషన్లు వేసినట్లు తెలిపారు.

మొత్తం 16 మంది అభ్యర్థులు.. 27 సెట్లు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): ఎల్లారెడ్డి అసెంబ్లీ స్థానానికి మొత్తం 16 మంది అభ్యర్థులు 27 సెట్ల నామినేషన్లు వేశారు. బీజేపీ అభ్యర్థి సుభాష్‌రెడ్డి 4సెట్లు, కాంగ్రెస్ అభ్యర్థి మదన్‌మోహన్ రావు, బీఆర్‌ఎస్ అభ్యర్థి జాజాల సురేందర్ 2 సెట్ల చొప్పున నామినేషన్లు దాఖలు చేశారు.

రమణారెడ్డి తరఫున మహిళా నేతల నామినేషన్ దాఖలు

కామారెడ్డి టౌన్: కామారెడ్డి అసెంబ్లీ బీజేపీ అభ్యర్థి కాటిపల్లి వెంకటరమణారెడ్డి తరఫున బీజేపీ మహిళా నాయకులు గురువారం నామినేషన్ దాఖలు చేశారు. ఆర్డీవో కార్యాలయంలో ఆర్‌వోకు పత్రాలను సమర్పించారు. 26వ వార్డు కౌన్సిలర్ అన్మండ్ల మానస, బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షులు సంధ్య, తదితరులున్నారు.

జాతీయ జనసేన అభ్యర్థిగా శివరాములు

కామారెడ్డి అర్బన్: బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు సాప శివరాములు జాతీయ జనసేన పార్టీ అభ్యర్థిగా కామారెడ్డి నియోజకవర్గం నుంచి శుక్రవారం నామినేషన్ వేశారు.